

# ఏటి ఒడ్డున నీటిపూలు

## - కొలిపాక రమామణి



రమామణిగారు 29 యేళ్ళ వయసులో వ్రాసిన మొదటి నవల ఈ 'ఏటి ఒడ్డున నీటిపూలు'. పోటీల్లో బహుమతి గెలుచుకుంది. తర్వాత కన్నడపత్రికలో అనువాదమై సీరియల్ గా వచ్చింది. అప్పుడు పుస్తకరూపంలో వెలువడింది. ఆ తర్వాత నాలుగైదు సంవత్సరాల వ్యవధిలోనే 'వెన్నెల్లో పిల్లనగ్రోవి', 'గడ్డిపోచలు','హాలాహలంలో అమృతం' లాంటి పాఠకాదరణ పొందిన నవలలు వ్రాశారు. అప్పటి అన్ని ప్రముఖపత్రికలలోను, ఆకాశవాణికి కథలు కూడా వ్రాశారు.

(గత సంచిక తరువాయి)

ఆంధ్రప్రభ వారపత్రిక ఉగాది నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన నవల (1968)

15

కోడల్ని కాపరానికి పంపమంటూ వియ్యపురాలి దగ్గిరినించి ఒక్క ఉత్తరమూ రాకపోయేసరికి కంగారు పుట్టింది వరలక్ష్మికి. కూతురి కాపరం గురించి బెంగ పట్టుకుంది. "కాపరానికి ముహూర్తం పెట్టి, మనమే అమ్మాయిని మద్రాసు తీసుకెళ్ళి అత్తగారి ఇంట్లో వదిలేసి వద్దాం" అంది ఆమె భర్త నారాయణరావుతో.

అతనికి కూడా వేరే మార్గం కనిపించక, పురోహితుడి చేత ముహూర్తం పెట్టించుకు వచ్చారు. వరలక్ష్మి వియ్యపురాలికి, నారాయణరావు అల్లుడికి ఉత్తరాలు రాశారు, తాము మద్రాసు వచ్చి పద్మని కాపరానికి వదిలి పెడుతున్నట్టు.

పద్మ ఒంటరిగా కూర్చుని ఏడ్చింది. భర్త రమ్మని రాయకుండా తాను వెళ్ళడం సుతరామూ ఇష్టం లేదు. తల్లితో, తండ్రితో చెబుదామనుకుంది. "నేను మద్రాసు వెళ్ళను. మీ దగ్గిరే ఉండిపోతాను" అని. కానీ దానివల్ల లాభం లేదు. తన కాపరం చక్కబడే వరకు వాళ్ళిద్దరికీ మనశ్శాంతి ఉండదు. ఏమీ చెయ్యలేక మౌనంగానే ఉండిపోయి దుఃఖించింది పద్మ.

ప్రయాణం ఇంకా రెండు రోజులు ఉందనగా కాంతమ్మగారినుంచి జవాబు వచ్చింది, పద్మను తీసుకువచ్చి మద్రాసులో వదిలేయమని.

పద్మకీ, వరలక్ష్మి, నారాయణరావుగార్లకి కొంచెం మనస్సులు కుదుటబడ్డాయి. కాంతమ్మ కోరినట్లు వజ్రాల దుద్దులతో, ఖరీదైన స్టీలుగిన్నెల సెట్టుతో కాపరానికి వెళ్ళింది పద్మ.

సెంట్రల్ స్టేషనుకు మాధవరావు, తల్లి వచ్చారు. వాళ్ళని చూడగానే కొండంత బరువు తీరినట్లయింది వరలక్ష్మికి.

"రండి వదినగారూ. ఎలా ఉన్నావు పద్మా?' అంటూ నవ్వుతూ పలకరించింది కాంతమ్మ.

మాధవరావు మామగారి యోగక్షేమాలను కురించి అడిగాడు. తరువాత అంతా టాక్సీ కట్టించుకుని ఇల్లు చేరారు.

రవ్వల దుద్దులు, స్టీలు గిన్నెలు, కోడలు తెచ్చిన సారె చూసి సంతోషించినట్టే కనిపించింది కాంతమ్మ. వియ్యపురాలు, వియ్యంకుడు ఉన్న రెండు రోజులు మర్యాదగానే చూసింది.

మాధవరావు పద్మతో ఒక్క మాట మాట్లాడలేదు. అతను తండ్రితో మాట్లాడుతున్నందుకే సంతోషించింది పద్మ.

మూడవరోజు ఉదయమే తిరుపతికి వెళ్ళిపోయారు పద్మ తల్లితండ్రులు, అట్నించి అటే కాకినాడ వెళ్ళిపోవడానికి.

కూతుర్ని వదిలి వెళుతున్నప్పుడు వరలక్ష్మి కంటినీరు ప్రవాహమయింది.

"వదినగారూ! మాకున్న ఒక్కగానొక్క కూతుర్ని మీ చేతుల్లో పెట్టాం. ఇక పద్మకి తల్లి, తండ్రి మీరే" అంటూ కాంతమ్మ చేతులు పట్టుకుంది.

"మీరు ఇంతగా చెప్పాలా?' అంది కాంతమ్మ.

మాధవరావు కూడా వాళ్ళని బస్సు ఎక్కించడానికి బ్రాడ్వేకి బయలు దేరాడు. కూతురు, అల్లుడు ఒక్కసారైనా మాట్లాడుకోవడం చూడని వరలక్ష్మి ఆ కొరత తీర్చుకోవాలనుకుంది. పద్మ తమతో బస్సు స్టాండుకు వస్తే వాళ్ళేమైనా మాట్లాడుకోవచ్చును.

గుమ్మం దగ్గిర నుంచున్న పద్మని చూస్తూ, "నువ్వూ బస్సు స్టాండుకు వస్తావా అమ్మా?" అంది.

పద్మకి ఏం చెయ్యాలో తెలియక అత్తగారి వైపు చూసింది.

"పద్మ ఎందుకులెండి? అబ్బాయి మిమ్మల్ని బస్సు ఎక్కించి, అటే ఆఫీసుకు వెళతాడు. పద్మకి ఊరు కొత్త. తిరిగి ఒంటరిగా రాలేదు" అంది కాంతమ్మ.

పద్మ అలాగే నిలబడి పోయింది. తల్లి,తండ్రి వెళ్లి పోయారు.

బస్సు కదిలాక కూడా వరలక్ష్మి ఏడుస్తూనే ఉంది.

"ఎంతసేపు ఏడుస్తావు? ఆడపిల్ల అన్నాక ఇంకో అయ్యా చేతిలో పెట్టకా తప్పదు. అత్తవారింట్లో వదలకా తప్పదు" అన్నాడు నారాయణరావు.

"ఆవిడ తత్వమేమిటో అర్థం కావటం లేదు నాకు. శోభనం మాట ఎత్తనే లేదు. ఏదో ఆ అడ్డు తీరిపోతే అమ్మాయి, అబ్బాయి కలిసి ఉండవచ్చును కదా" అంది కళ్ళు తుడుచుకుంటూ.

"ఈ రోజులలో కూడా ముహూర్తాలు, శోభనాలు ఏమిటి? ఎదిగిన పిల్లలు సిగ్గు పడతారు. ఇప్పుడింక ఒంటరిగానే ఉన్నారుగా. వాళ్ళే ఆ విషయం చూసుకుంటారు" అన్నాడు ఆయన. భార్యలా కుంగి పోకపోయినా ఆయనకీ కూడా మనస్సులో దిగులుగానే ఉంది.

16

కాకినాడ వదిలిన నెల్లాళ్ళకి శ్రీదేవి చారుమతికి ఉత్తరం రాసింది.

**"ప్రియమైన చారుమతికి,**

ఉత్తరం రాయలేదని తిట్టుకుంటున్నావా? ఇంత ఆలస్యంగా నేనెందుకు ఉత్తరం రాస్తున్నానో నీకూ పెళ్ళయి, భర్తతో హనీమూన్ కి వెళ్ళినప్పుడు తెలుస్తుంది. మేము బెంగుళూరు, మైసూరు చూసి వారం రోజుల కిందటే హైదరాబాద్ వచ్చాం. 'చూశాం! చూడలేదు!' ఏం రాయాలో తెలియటం లేదు. బృందావన్ గార్డెన్స్ లో బావ పక్కనే నడుస్తూ ఉంటే స్వర్గంలో ఉన్నట్టుంది. నీకూ తొందరలో పెళ్లి కావాలని ఆశిస్తున్నాను. చారూ! పెళ్ళిలో ఉండే ఆనందం, పెళ్లి అయిన తరువాతనే తెలుస్తుంది. ఈ నెలరోజులు ఇంత ఆనందం  సంతోషం అనుభవించాక నాకు అనిపించింది. 'ఈ జీవితానికి ఈ అనుభవం చాలు. ఇక చచ్చి పోయినా ఫరవాలేదు' అని. గంటలు క్షణాల లాగా, రోజులు గంటలుగా గడిచి పోతాయి. బావ నా చెయ్యి పట్టుకుని అన్నీ చూపిస్తున్నప్పుడు లోకాలు జయించిన మహారాణిలా సంతోషంగా ఉండేదాన్ని.

ఎన్నో రాయాలని ఉంది. నీకు ఎలా రాయడం? నీకు కూడా పెళ్లి అయితే మనం అన్ని విషయాలు స్వేచ్ఛగా రాసుకోవచ్చును.

ఈ ఉత్తరం ఇంతటితో ఆపుచేస్తున్నాను. కొత్త కాపరమా? ఇల్లు సర్దుకోవడంలో మునిగి పోయాను. హైదరాబాద్ విశేషాలన్నీ వేరే రాస్తాను. పద్మ ఎక్కడ ఉంది? మద్రాసు వెళ్ళిందా? పద్మ ఎడ్రసు వ్రాయి. ఉత్తరం రాస్తాను.

ఇంట్లో అందరు బాగున్నారని తలుస్తాను. మాలతి పరీక్ష తెలిసిందా?

భానక్కకి, అమ్మకి, మామ్మకి నమస్కారాలు. మాలతిని, అన్నని అడిగానని చెప్పు. జవాబు రాయి.

**ప్రేమతో**

**దేవి**

చారుమతి ఉత్తరం రెండు మూడు సార్లు చదువుకుంది. ప్రతి వాక్యంలోనూ శ్రీదేవి మానసికానందం వెల్లడి అవుతూంది. 'వాళ్ళిద్దరిదీ అన్యోన్య దాంపత్యం' అనుకుంది చారుమతి.

'నాకెప్పటికైనా ఇలాంటి భర్త ప్రేమ, దాంపత్య సౌఖ్యం లభిస్తవా? శ్రీదేవి 'నీకు పెళ్లి అయితే' అని రాస్తుంది. నన్ను ఎవరు చేసుకుంటారు? పెళ్లి కొడుకుని చూసిపెట్టే తండ్రి లేదు. వరుడిని ఎవరైనా చూపించినా, కొనుక్కోడానికి, పెళ్లి ఖర్చుకి డబ్బు లేదు.' చారుమతిలో ఏదో నిరాశ ఆవరించింది. మళ్ళీ నిరాశ మధ్యే ఆశ! డాక్టర్ గిరిదారిని గురించిన ఊహలు!

చారుమతి సాయంత్రం పద్మ ఇంటికి వెళ్ళింది. మరలక్ష్మి ముందు వరండాలో స్తంబానికి చేరబడి కూర్చుంది. నారాయణరావు ఆమె కెదురుగా పడక కుర్చీలో పడుకున్నాడు.

"చీకటిలో కూర్చున్నారేమిటండీ?" అంటూ వచ్చింది చారుమతి.

"ఎవరూ? చారుమతా? రామ్మా, రా" అంటూ లోపలి పిలిచి, వరండాలో లైటు వేసి, చాప తెచ్చి వేసింది వరలక్ష్మి.

"శ్రీదేవి ఉత్తరం రాసింది, పద్మ ఎడ్రెస్ ఇవ్వమంటూ. పద్మ ఎడ్రస్ ఇస్తారా?' అంది చాప మీద కూర్చుంటూ చారుమతి.

"పద్మ ఎడ్రెస్ తప్పక ఇస్తాను. శ్రీదేవి బాగుందా? ఏమిటి రాసింది ఉత్తరంలో?'

"శ్రీదేవి బాగుందిట. ఈ మధ్యే బెంగుళూరు, మైసూరు తిరిగివచ్చి హైదరాబాద్ లో కాపరం పెట్టారట. పద్మ ఎలా ఉందండీ? ఉత్తరాలు రాస్తుందా? నాకు ఒక్క ఉత్తరం రాయలేదు" అంది చారుమతి.

"ఏం బాగోనమ్మా! పద్మ మాకే సమంగా ఉత్తరాలు రాయదు. మళ్ళీ బి.ఏ. లో చేరిందిట. ఈ చదువేమిటో, ఏం గొడవో తెలియటం లేదు" అంది వరలక్ష్మి కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ.

"ఎందుకు అస్తమానం ఏడుస్తావు? మాట్లాడితే ఆడవాళ్ళకి కళ్ళనీళ్ళు వస్తాయి" అన్నాడు నారాయణరావు.

"ఆడపిల్లను కన్నందుకు ఏడుపేనండీ! బంగారం లాటి పిల్లను అపురూపంగా పెంచుకుని పెళ్లి చేస్తే, అది సుఖపడకపోతే కష్టం కాదా? చారుమతీ! నువ్వే చెప్పమ్మా."

చారుమతి వరలక్ష్మి వైపే సానుభూతిగా చూస్తూ మౌనంగా కూర్చుంది.

"ఎలా ఉందమ్మా మీ స్కూలు? శంకరానికి ఏమైనా ఉద్యోగం దొరికిందా?" అంటూ ప్రసంగాన్ని మార్చాడు నారాయణరావు.

"శంకరానికి ఉద్యోగం ఏమీ దొరకలేదండీ. ఉద్యోగ ప్రయత్నంలోనే ఉన్నాడు. ఎక్కడైనా దొరికితే బాగుండును."

"ఉద్యోగాలు దొరకడం చాలా కష్టంగా ఉందమ్మా. ఏం.ఏ., బి.ఏ. చదివిన వాడికంటే కూలివాడు నయం. వాడికి తొందరగా పని దొరుకుతుంది.

చారుమతి కాస్సేపు మాట్లాడి, పద్మ ఎడ్రసు తీసుకుని లేచింది.

"పద్మ ఉత్తరం రాయకపోయినా, నువ్వు రాస్తూ ఉండమ్మా. స్నేహితురాళ్ళ దగ్గర్నించి ఉత్తరం వస్తే దానికి కొంచెం ఊరటగా ఉంటుంది" అంది వరలక్ష్మి.

"అలాగేనండీ" అంటూ వాళ్ళిద్దరికీ నమస్కరించి ఇంటి ముఖం పట్టింది చారుమతి.

17

పద్మ మద్రాసు వచ్చి రెండు నెలలు దాటి పోయింది. పద్మ జీవితంలో మార్పేమీ లేదు. పొద్దున్నే లేచి అత్తగారికి వంటలో సాయం చేసి, తొమ్మిది గంటలకి భోజనం చేసి కాలేజీకి వెళుతుంది. సాయంత్రం ఆరు గంటలకి ఇల్లు చేరుతుంది. రాత్రి వంట పద్మ మీదే పడింది. ఎనిమిది గంటలకి మాధవరావు వస్తాడు. అతనికి దగ్గిర కూర్చుని అత్తగారే భోజనం పెడుతుంది. తరవాత పద్మ, అత్తగారు కూర్చుని భోజనం చేస్తారు. మాధవరావు పద్మతో ముభావంగా ఉంటాడు. పద్మ అనే మనిషి ఇంట్లో ఉన్నట్టే తెలియనట్టు ప్రవర్తిస్తాడు. తల్లితోనే మాట్లాడుతాడు. అత్తగారే పద్మతో మాట్లాడుతుంది. అదికూడా వంటలను గురించే. "ఇంత పెద్దదానివి. నీకు వంట చేత కాక పోవడ మేమిటీ? మీ అమ్మ ఎందుకు నేర్పలేదు? ఇక్కడ అరవవాళ్ళ పిల్లలు పనిలో ఎంతో నేర్పరులు. పదేళ్ళ పిల్ల కూడా కమ్మటి సాంబారు పెట్టి, భోజనం పెట్టగలదు." ఆవిడ సంబాషణ ఈ ధోరణిలోనే నడుస్తుంది. ప్రతి పనికి అరవ పిల్లల్ని మెచ్చుకుని, కోడల్ని కించ పరుస్తూ ఉంటుంది.

'ఇంటి కంటే కాలేజీయే నయం' అనుకుంటుంది పద్మ. కాలేజీలో కూడా ముభావంగా ఉండే పద్మకి పరిచయస్తులు చాలా తక్కువ. 'ఇంత అందమైన పిల్ల అంత విచారంగా కనిపిస్తుందేం?' అనుకుంటారు క్లాసు పిల్లలు.

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకి పద్మ పుస్తకాలు ముందర వేసుకుని తన గదిలో కూర్చుంది.

ఆ ఇంటికి మూడు గదులు. ఒకటి పెద్ద హాలులాంటి గది. దాన్ని ఆనుకుని రెండు చిన్న గదులు. ఒక గది మాధవరావుది. ఒక గది పద్మది. అత్తగారు హాలులోనే కూర్చుంటుంది. అక్కడే రాత్రి ముగ్గురు మంచాలు వేసుకుని పడుకుంటారు. మధ్యన అత్తగారు, చెరో పక్కన కొడుకు, కోడలూనూ. అలా పడుకోడానికి కొత్తలో ఎంతో సంకోచంగా ఉండేది పద్మకి. కాని రాను రాను అలవాటై పోయింది.

పుస్తకాలు ముందర వేసుకుని కూర్చున్నా మనస్సు పాఠాల మీద నిలవడం లేదు.

"అమ్మాయ్! అన్నట్టు నీకో ఉత్తరం వచ్చింది మధ్యాహ్నం" అంటూ ఒక కవరు తెచ్చి ఇచ్చింది పద్మకి కాంతమ్మ.

పద్మ కవరు విప్పి చూస్తూ ఉండే, "ఎవరు రాశారు?" అంది అక్కడే నుంచున్న కాంతమ్మ.

"శ్రీదేవి, మా స్నేహితురాలు" అని పద్మ ఉత్తరం చదువుకోవడం మొదలు పెట్టింది. కాంతమ్మ అక్కడినించి వెళ్లి పోయింది.

**"ప్రియ పద్మకు,**

ఎలా ఉన్నావ్ పద్మా? మీ శ్రీవారి ఒళ్లో పడుకుని నా ఉత్తరం చదువుతున్నావా? తనే ఉత్తరం చదువుతానంటూ నీ చేతులలోనించి ఉత్తరం ఆయన లాగేసుకుంటున్నారా? నీ మృదువైన చేతులు జ్ఞాపకం వస్తున్నాయి. వాటితో ఇక దెబ్బ వేసినా ఆయనకు దెబ్బే తగలదు!

నీకు ఉత్తరం రాస్తూంటే నాకు నువ్వు, మీ శ్రీవారు జ్ఞాపకం వస్తున్నారు. నీలాంటి అందగత్తెను భార్యగా పొందటం ఆయన అదృష్టం. మీ ఇద్దర్ని మీ పెళ్ళిలో చూసి మేం ఏమనుకున్నామో తెలుసా? ఈడు-జోడు రతీమన్మదుల్లా ఉన్నారనుకున్నాము.

అబ్బ! బావ నన్ను ఉత్తరం రాయనివ్వడం లేదు. నా చేతిలో నించి పెన్ను లాగేసుకుని, దీపం ఆర్పేస్తారుట 'నువ్వు ఎలా ఉత్తరం రాస్తావో చూస్తాగా?' అని అల్లరి పెడుతున్నారు.

మద్రాసు జీవితం ఎలా ఉందో రాయి. మీ వారిని గురించి, అత్తగారిని గురించి అన్ని విషయాలు రాస్తావు కదూ. నాకు హైదరాబాద్ చాలా నచ్చింది. ఈ మధ్యే సాలార్ జంగ్ మ్యూజియం చూసి వచ్చాం. ప్రతి ఆదివారం పబ్లిక్ గార్డెన్స్ వెళుతూ ఉంటాం.

పద్మా! నువ్వు వంట నేర్చుకున్నావా? నీకేం? దగ్గిర అత్తగారు ఉన్నారు. అన్ని సలహాలూ చెబుతారు. నాకు బలే కష్టంగా ఉందనుకో. 'బియ్యంతో కూడా ఎన్ని ఎక్స్పెరిమెంట్లు చెయ్య వచ్చునో నువ్వు వంట మొదలు పెట్టాకే తెలిసింది. రోజుకో రకంగా, పూట కో విధంగా అన్ని వండటం నీకే తెలుసు' అంటూ బావ ఎగతాళి చేస్తూ ఉంటారు.

పెద్ద ఉత్తరం రాస్తావుగా! నేను మా సంసార విషయాలన్నీ రాస్తాను. మీ శ్రీవారిని అడిగానని చెప్పు. అత్తగారికి నమస్కారములు.

**ప్రేమతో**

**శ్రీదేవి**

ఉత్తరం చదవడం పూర్తి చేసి, బల్ల మీదే తల పెట్టుకుని పడుకుంది పద్మ. ఆపుకుందామన్నా కళ్ళనీళ్ళు ఆగటం లేదు. 'మా శ్రీవారు నాతో అసలు మాట్లాడరు. ఇంక నా చేతుల అందం చూడటం ఏమిటి? ఏం రాయమన్నావు, శ్రీదేవీ? నా అంత దురదృష్టవంతురాలు ఈ లోకంలో లేదని రాయనా?'

మధ్య హాలులో లైట్లార్పేసి అత్తగారు, భర్త పడుకుని కబుర్లు చెప్పుకోడం వినిపిస్తోంది. 'తల్లితో మాట్లాడడానికి అన్ని మాటలు ఉన్నప్పుడు, భార్యని చూడగానే మూగితనం వస్తుందేం?' అనుకుంది పద్మ, మాధవరావు మీది కోపంతో.

18

సెప్టెంబరు మాసం. ఒకటే వర్షాలు. ఆ రోజు తెల్లవారుతూనే మొదలైన వర్షం ఉదయం తొమ్మిది గంటలైనా తగ్గు ముఖం పట్టలేదు. చారుమతి స్నానం చేసివచ్చి, స్కూలుకు వెళ్ళటం కోసం జడ వేసుకుంటూంది. ఇంట్లో అంతా లేచి ఎవరి పనులలో వాళ్ళు ఉన్నారు. ముసలమ్మ నులకమంచం మీద ఒక మూల బొంత కప్పుకుని పడుకుంది. రెండో వైపు చాప మీద శంకరం నిండా దుప్పటి ముసుగు పెట్టి ఇంకా నిద్ర పోతున్నాడు. 'ఎంత అదృష్టవంతుడు! పొద్దున్న లేచి బయటికి పరిగెత్తవలిసిన పనిలేదు. నిశ్చింతగా పడుకున్నాడు' అనుకుంది చారుమతి, అసూయతో. శంకరం ఉద్యోగ ప్రయత్నాలు ఏమీ కలిసి రాలేదు. అర్హతలు సరిపోతాయని తోచిన ప్రతి ఉద్యోగానికీ దరఖాస్తులు పెడుతున్నాడు. కొడుక్కి ఉద్యోగమైతే, నేతిదీపం పెట్టి వెంకటరమణమూర్తికి కొబ్బరికాయ కొడతానని మొక్కుకుంది శాంతమ్మ. 'కూతురికి పెళ్ళి అయితే కొబ్బరికాయ కొడతానని మొక్కుకోకూడదా? భానక్కకి పాతికేళ్ళు వచ్చి ఇంట్లోనే ఉండిపోయింది' అనుకుంది చారుమతి.

"శంకరం! శంకరం! కొంచెం తలుపు తీస్తావా?" ముందు గదిలో నించి రామారావుగారి గొంతుక వినిపించింది. మధ్య ఉన్న తలుపు తియ్యమంటున్నారు.

చారుమతి వెళ్లి తలుపు తీసి, "ఏం కావాలి మాస్టారూ?  శంకరం ఇంకా నిద్ర లేవలేదు" అంది.

"శంకరాన్ని నిద్ర లేపనక్కర లేదు. బాత్ రూముకి ఇలా వెళ్ళవచ్చునేమో కనుక్కుందామని పిలిచాను. బయట పెద్ద వర్షం పడుతూంది."

"ఇలా వెళ్ళవచ్చును. వెళ్ళండి" అంది చారుమతి, దారి తొలుగుతూ.

రామారావుగారు టవల్ భుజం మీద వేసుకుని స్నానాల గది వైపు వెళ్ళారు.

రామారావుగారికి గది అద్దెకి ఇవ్వడం వాళ్ళ పెద్ద ఇబ్బంది ఏమీ కలగలేదు చారుమతీ వాళ్ళకి. ఆయన ఉదయం ఒక్కసారి సందుగుండా వెనక పెరటిలోకి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేసి వెళ్ళిపోతారు. తరువాత రోజులో ఒక్కసారి కూడా వెనక పెరడు వైపు రారు. తమ పనేదో తాము చూసుకోవడం తప్ప ఇంటి వాళ్ళ విషయాలు పట్టించుకోరు. ఆయన హైస్కూలులో టీచరుగా పని చేస్తున్నారు. ఆయన్ని ఇంట్లో అంతా "మాస్టారు" అనే పిలుస్తారు.

శంకరానికి రామారావుగారి దగ్గిర మంచి చనువు ఏర్పడింది. రామారావుగారు ఇంట్లో ఉన్నంతసేపు ఆయనతోనే గడుపుతాడు. రామారావుగారు తెలుగు వారపత్రికలు, మాస పత్రికలు కొంటారు. కొన్ని ఇంగ్లీషు పత్రికలు, రోజూ దినపత్రిక కొంటారు. శంకరం ఆయన దగ్గిరినించి పత్రికలు, పుస్తకాలు తెచ్చి ఇంట్లో ఆడపిల్లలకి ఇస్తాడు. దాంతో వారికి మంచి కాలక్షేపం దొరికింది.

రామారావుగారు స్నానం చేసి తిరిగి వచ్చే సరికి శంకరం అప్పుడే నిద్ర లేస్తున్నాడు.

"ఇప్పుడయ్యా నిద్ర లేవడం? తొమ్మిదైపోయింది" అన్నారు.

"ఏనేముంది మాస్టారూ, నిద్ర, భోజనం తప్ప మనకి?" అంటూ శంకరం నవ్వేసాడు.

మాగన్నుగా నిద్రపోతున్న ముసలమ్మ లేచింది.

"ఎవరు వచ్చారురా శంకరం? ఎవరితో మాట్లాడుతున్నావు?" అంది.

"మాస్టారు మామ్మా! మనింట్లో అద్దెకున్నాయన" అని చెప్పి రామారావుగారి వైపు తిరిగి, "ఈవిడ మా మామ్మగారు, మాస్టారూ. మా నాన్నగారి తల్లి" అని పరిచయం చేశాడు.

"నమస్కారమండీ" అని నమస్కారం చేసి తన గదిలోకి వెళ్ళిపోయారు రామారావుగారు. ఆయన ముసలమ్మని చూడడం అదే ప్రథమం.

చారుమతి భోజనం చేస్తూంది.

"మాస్టారూ, మాస్టారూ అంటూ ఆయన వెనకాలే తిరుగుతావు. ఏదైనా ఉద్యోగం చూసి పెట్టమని అడగ కూడదూ?" అంది శంకరాన్ని చూస్తూనే.

శంకరం కాఫీ కోసం వంటింట్లోకి వచ్చాడు.

"అడిగానే. ఏదో హైస్కూలులో లీవు వేకెన్సీ ఉందని తెలిసింది. ఇవ్వాలో, రేపో నన్ను తీసుకువెళ్ళి హెడ్ మాస్టర్ తో మాట్లాడుతానన్నారు."

"ట్రైనింగ్ లేనివాడివి, నీకెవరు ఇస్తారు ఉద్యోగం?"

"లీవ్ వేకెన్సీ రెండు నెలలే కదా. ఇవ్వవచ్చును."

మరునాడు సాయంత్రం శంకరం ఇంటికి వచ్చి చెప్పాడు, ఉద్యోగం వచ్చిందని. శ్రీనివాస స్వామికి కొబ్బరికాయ కొట్టి మొక్కు తీర్చింది. శంకరం రెండు నెలలూ ఉద్యోగం చేసి జీతం తెచ్చి తల్లి చేతిలో పోశాడు. ఆ జీతంతో అప్పులు సగం తీరాయి. కాని ఏం లాభం? రెండు నెలలు దాటగానే తిరిగి శంకరం నిరుద్యోగి అయ్యాడు. ఇంట్లో పరిస్థితులు మామూలు స్థితికి వచ్చాయి.

శంకరం మధ్యాహ్నం పన్నెండు గంటలకి భోజనం చేసి, తిరిగి రామారావుగారి గదిలోకి వచ్చాడు. ఆయన స్కూలుకి వెళ్ళలేదు. ఇంట్లోనే ఉన్నారు.

"ఏం మాస్టారూ, స్కూలుకి వెళ్ళలేదా ఇవ్వాళ?" అంటూ లోపలి వచ్చి కూర్చున్నాడు.

"లేదోయ్, సెలవు పెట్టాను."

ముసలమ్మ గదిలో తలుపుకి చేరబడి, చిరిగిన చీర కుడుతున్న భానుమతికి వీళ్ళ మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. భానుమతి రోజూ అక్కడే కూర్చుంటుంది. భోజనాలయ్యాక వంటిల్లు కడుగుతారు. పొడిగా ఉన్న భాగంలో చాప పరుచుకుని పడుకుంటుంది శాంతమ్మ.

"ఏమోయ్, శంకరం, అలా దిగులుగా ఉన్నావు? ఏమిటి సంగతి?" మాస్టారి కంఠం వినిపించింది.

"ఏముందండీ, నా ఉద్యోగం విషయమే. ఏదైనా దొరికితే బాగుండునండీ."

"ఏదైనా దొరికితే చేస్తావా?"

"ఎలాంటి ఉద్యోగమైనా సరే చేస్తానండీ"?

"ప్యూను ఉద్యోగం దొరికితే చేస్తావా?"

"మాస్టారూ! మీరు మరీ హాస్యం చేస్తున్నారు. నేను ప్యూను ఉద్యోగం చెయ్యడమేమిటీ?"

"ఇప్పుడే అన్నావు కదా, 'ఏ ఉద్యోగమైనా సరే' అని. ప్యూను ఉద్యోగం తీసి పోయిందా? నెలకి అరవై డెబ్భై రూపాయలు వస్తాయి."

"డబ్బు వస్తుందని ప్యూనుగా చేరమంటారా ఇంత చదువూ చదివి?"

"ఏ ఉద్యోగమూ లేకుండె కంటే, ఏదో ఒకటి మెరుగు కదూ! ఆ మాటకి వస్తే నేను ముందు ప్యూనుగానే చేరాను."

"నిజమా మాస్టారూ? మీరు ప్యూనుగా చేరారా? ఎందుకని?"

"మీ ఇంటి పరిస్థితులలాంటివే మావీ శంకరం! అప్పటి మా పరిస్థితులతో పోల్చుకుంటే మీరెంతో నయం."

"ప్యూనుగా ఎందుకు చేరారు? చెప్పండి మాస్టారూ?" శంకరం కంఠంలో ఎంతో కుతూహలం.

"మా తలిదండ్రులకి నేను, మా చెల్లెలు ఇద్దరమే సంతానం. మా నాన్న ఎలిమెంటరీ స్కూలులో టీచరు. మేముకాని, మా బంధువులుగాని ఎవరూ స్థితి మంతులం కాదు. అందరివి పేద కుటుంబాలే. మా నాన్న కష్టపడి నన్ను ఎస్.ఎస్.ఎల్.సి. దాకా చదివించారు. నేను పరీక్ష రాసిన కొన్ని రోజులకే మా నాన్న చనిపోయారు. అప్పటికి నాకు పదిహేను నిండి పదహారేళ్ళు. ఎస్.ఎస్.ఎల్.సి. లో మంచి మారులు వచ్చినా ఉద్యోగం ఎవరిస్తారు? కాని ఉద్యోగం దొరకక పోతే మా అమ్మ, నేను, చెల్లెలు అడుక్కు తినాలి. నేనప్పుడు మా స్కూలు హెడ్ మాస్టర్ దగ్గిరికి వెళ్లి, మా ఇంటి పరిస్థితులు చెప్పి, సలహా కోసం అర్థించాను. ఆయన నన్ను తీసుకుని వారి స్నేహితులొకరి దగ్గిరికి వెళ్ళారు. ఆయన ఒక గవర్నమెంటు ఆఫీసులో ఆఫీసరుగా ఉంటున్నారు. ఆయన మా ఇంటి పరిస్థితులు అన్నీ విని ఇలా అన్నారు.

"చూడు రామారావూ! మీ ఇంటి పరిస్థితులు వింటే జాలిగా ఉంది నీకు ఎస్.ఎస్.ఎల్.సి. లో మార్కులు కూడా బాగా వచ్చాయి. కాని నీ వయస్సే ఇబ్బంది కలిగిస్తుంది. పద్దెనిమిది నిండితే కాని మా ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం కూడా ఎవ్వరికీ ఇవ్వం. కాని నీకో సలహా చెబుతాను. నువ్వు ఇష్టపడితే మా ఆఫీసులో ప్యూనుగా చేర్చుకుంటాను. ఇందులో నువ్వు చిన్నతనం పడవలసింది ఏమీ లేదు. ఎలాగా నువ్వు కాలేజీలో చేరి చదవలేవు. చిన్నవాడివైన నీకు వేరే ఉద్యోగమేమీ దొరకదు. మా ఆఫీసులో ప్యూన్ని మేం గౌరవంగానే చూస్తాం. నీ గౌరవానికెప్పుడూ లోపం జరగదు. మీ కుటుంబానికి సాయపడినట్లూ ఉంటుంది. రెండేళ్ళు మా ఆఫీసులో పనిచేస్తే పద్దెనిమిది ఏళ్ళు వస్తాయి. వేరే ఉద్యోగం కోసం వెతుక్కోవచ్చును. ఆలోచించుకుని నాకు రేపు చెప్పు."

ప్యూనుగా చేరమనగానే నాకెంతో బాధ అనిపించింది. కాని మా హెడ్ మాస్టరుగారు ప్రోత్సహించారు. గౌరవం అనేది మనిషికి కాని, పనికి కాదని, ఈ పరిస్థితులలో ఈ ఉద్యోగం తప్ప వేరే మార్గం కనిపించడం లేదని, నన్ను వెంటనే ఆఫీసులో చేర మని చెప్పారు.

అలా నేను ప్యూనుగా చేరాను. నాకప్పుడు నెలకి ఇరవై రూపాయలు వచ్చేవి. ఇది జరిగింది పాతికేళ్ళ కిందట. అప్పుడు ఇరవై రూపాయలంటే ఇప్పటి తొంభై రూపాయలతో సమానం.మేం ఆ ఇరవై రూపాయలతోనే గడుపుకునే వాళ్ళం." మాస్టారు ఆగారు.

"తరువాత ఏమైంది మాస్టారూ? మీరు బి.ఏ. ఎలా చదివారు?" శంకరం ఆపేశారేం? అన్నట్టు అడిగాడు.

"నేను ప్యూనుగా చేరానా? కాని అక్కడ నా జీవితం సాఫీగానే సాగింది. నేను చదువుకున్న వాడినని తక్కిన ప్యూన్స్, ఆఫీసులో ఉద్యోగస్థులు కూడా నన్ను గౌరవంగానే చూసేవారు. పని చాలా తక్కువ. చాలా ఖాళీ ఉండేది. లైబ్రరీ నించి పుస్తకాలు తెచ్చుకుని చదివే వాణ్ణి. ఆఫీసుకి వచ్చిన పత్రికలు, పేపర్లు, ఉద్యోగస్థులు అందరు చదివేశాక నేను ఇంటికి తెచ్చుకుని చదివేవాణ్ణి. దీనితో నా ఇంగ్లీషు , తెలుగు రెండూ

అభివృద్ధి పొందాయి. రెండేళ్ళు అవగానే అదే ఆఫీసులో నాకు ఎల్.డి.సి. ఉద్యోగం ఇచ్చారు. తరవాత కష్టపడి చదివి ఇంటర్ మీడియట్ పరీక్షకి కట్టాను. నా చదువుకి అక్కడ చిన్న అడ్డుకట్ట పడింది."

"ఏమైంది? " శంకరం అడిగాడు.

"నా కంటె మా చెల్లెలు పదేళ్ళు చిన్నది. చెల్లెలికి పదిహేను ఏళ్ళు వచ్చే సరికి అమ్మ చెల్లెలి పెళ్లిని గురించి బెంగ పెట్టుకుంది. కట్నాలు ఇచ్చి పెద్ద ఉద్యోగస్థుణ్ణి తేలేం కనక, కొంచెం తెలివైన పిల్లవాణ్ణి తెచ్చి, పెళ్ళిచేసి అతని చదువుకి నేనే సహాయం చెయ్యాలనుకున్నాను. పెళ్ళికొడుకు కోసం తిరుగుతూ ఉండగానే ఒకరోజు అమ్మకి పక్షవాతం వచ్చి మంచాన పడింది. సరే, దానితో నా ఊహలన్నీ తలకిందు లైనాయి. అస్తమానం కాంప్ లు ఉండే ఆఫీసు ఉద్యోగం మానేయ్య మంది అమ్మ. నేను కాంప్ కి వెళ్ళితే ఇంట్లో అమ్మ, చెల్లెలు ఇద్దరూ ఒంటరిగా ఉండటానికి భయపడే వాళ్ళు. నేను ఆఫీసులో పని మానేసి హైస్కూలులో లోయర్ గ్రేడ్ టీచరుగా చేరాను. మా చెల్లెలికి పద్దెనిమిది ఏళ్ళకి పెళ్లి చెయ్యగలిగాను. పెళ్లి కొడుక్కి ఇరవై రెండేళ్ళు. అతను ఎస్.ఎస్.ఎల్.సి. పాసై మిడిల్ స్కూలులో టీచరుగా ఉండేవాడు. అతన్ని ప్రోత్సహించి పరీక్షకి ఫీసు కట్టి, ఇంటరు పరీక్ష వ్రాయించాను. తరువాత నేనూ, మా బావమరిదీ ఇద్దరం చదివి ఒక్కసారే బి.ఏ. కట్టి పాసయ్యాం. తరవాత ఇద్దరికీ హైస్కూలులో సెలవు దొరికింది. బి.ఇ.డి. ట్రైనింగ్ చదివాం. టీచర్లుగా స్థిరపడ్డాం. ఇదీ మా కథ."

"మరి, మీరు పెళ్లి ఎప్పుడు చేసుకున్నారు మాస్టారూ?"

"నేను పెళ్లి చేసుకున్నానని ఎవరు చెప్పారు? నేను పెళ్లి చేసుకోలేదు. నాకు మా కుటుంబ బాధ్యతలు తీరేసరికి ముప్పై ఏళ్ళు దాటి పోయాయి. అమ్మ చనిపోయింది. పిల్లని చూసేవాళ్ళు లేరు. అంత పెద్దవాడికి పిల్లను ఎవరిస్తారు?"

"అదేమిటి మాస్టారూ! మీరు పెళ్లి చేసుకుని ఉండవలసింది." మాస్టారి కథవిని, ఆయన మీద కలిగిన జాలితో, పెరిగిన గౌరవంతో అన్నాడు శంకరం.

"నాకు పెళ్లి ఎందుకోయ్? ఇప్పుడు నాకేమిటి తక్కువ?" హాయిగా గడిచి పోతూంది జీవితం."

తలుపు వెనక నించి వీళ్ళిద్దరి మాటలూ వింటున్న భానుమతి ఆశ్చర్యపోయింది. ఇన్నాళ్ళూ మాస్టారికి పెళ్లి అయిందనీ, భార్య, పిల్లలు వేరే చోట ఉండి ఉంటారనీ ఊహించారంతా. మాస్టారి కథ విన్నాక భానుమతికి కూడా ఆయనమీద గౌరవం ఇనుమడించింది.

20

సాయంత్రం చారుమతి ఇంటికి వస్తూనే చిరాగ్గా వచ్చింది. స్కూలులో ఏదో సవ్యంగా చెయ్యలేదని హెడ్ మిస్ట్రెస్ సన్నగా చీవాట్లు వేశారు. 'ఛీ.. ఛీ... వెధవ జీవితం' అని విసుక్కుంది తనమీద తనే. చికాకుగా ఉన్న ఇంటి పరిస్థితులతో విసుగెత్తిన చారుమతికి స్కూల్లో పనికూడా విసుగ్గా ఉంటూంది. చీటికీ మాటికీ పిల్లల్ని కేకలేస్తుంది. కసురుకుంటుంది. ఉదయం లేవగానే ప్రైవేట్లు, తరవాత స్కూలు, మళ్ళీ సాయంత్రం ప్రైవేట్లు. 'ఈ జీవితానికి అంతం ఎక్కడ?" అనుకుంది తలపట్టుకొని.

పేదవాళ్ళుగా బ్రతికే కంటె చావటం మేలనిపిస్తుంది. ఇంత కష్టపడినా ఏ మాత్రం సుఖం లేదు. వయస్సులో తీరవలిసిన కోరికలు ఎలాగా లేవు. కనీసం విసుగ్గా ఉన్నప్పుడు ఒక సినిమాకో, గానసభకో వెళదామన్నా ఆ ఆశ కూడా లేదు. డబ్బులు లేక అన్ని ఆశలు చంపుకోవాలి.' చారుమతికి ఎవరిని చూసినా కోపం, ఏది చూసినా విసుగు కలుగుతూంది. రోజు రెండు పూటలా కడుపు నిండా తిండి, కట్టుకోను బట్ట, కనీసం చిన్నచిన్న కోరికలు, సరదాలు తీర్చుకునే అవకాశం ఉంటే ప్రతి మనిషి సరదాగానే, మంచిగానే ఉంటాడు. ఎదటి మనిషితో స్నేహం చేస్తాడు, పక్క మనిషిని ప్రేమిస్తాడు. అందరితోను హాయిగా, సంతోషంగా నవ్వుతూ మాట్లాడుతాడు. మన జీవితం మనం కోరుకున్న విధంగా నడిచి పోతూంటే లోకమంతా అందంగా ఇంద్ర ధనుస్సు రంగులతో కనబడుతుంది. జీవితమంతా చీకటిగా, ఎదురు దెబ్బలు తింటూ గడిపే వాళ్లకి లోకం కూడా వికారంగానే కనిపిస్తుంది.

చిరాగ్గా వచ్చిన చారుమతిని చూస్తూనే శాంతమ్మ అడిగింది "ఏమయిందే, అలా ఉన్నావు?"

"ఏదో ఒకటి. నా తల పగిలి పోతూంది. విపరీతమైన తలనెప్పి." చారుమతి తల పట్టుకుంటూ వెళ్లి చాప పరచుకుని పడుకుంది.

భానుమతి మంచి నీళ్ళలో పంచదార వేసి గ్లాసులో తీసుకువచ్చింది. అది చూస్తూనే చారుమతి ఇంత ఎత్తున లేచింది.

"ఎన్నిసార్లు చెప్పాను నాకు స్కూలు నించి రాగానే గుక్కెడు కాఫీ పొయ్యమని, లేకపోతే నా ప్రాణం నిలవదనీను? అన్నం లేకపోయినా ఫరవాలేదు. కాఫీ లేకపోతే బ్రతకలేనని చెబితే ఒకళ్ళూ వినిపించుకోరేం? నాకేం అక్కరలేదు. తీసుకు వెళ్ళు." ధన్ మంటూ విసురుగా గ్లాసు పెట్టి పక్కకి తిరిగి పడుకుంది.

నెలాఖరు రోజుల్లో కాఫీపొడి, పంచదార లాంటివి అయిపోవడం మామూలే.

గుమ్మం దగ్గరే నుంచున్న శాంతమ్మ నొచ్చుకుంది.

"భానూ! శంకరాన్ని పంపి హోటల్ నుంచి కొంచెం కాఫీ తెప్పించమ్మా" అంది.

కాని భానుమతి అక్కడే తచ్చాడుతూంది.

"ఏమిటి కావాలి?" శాంతమ్మే అడిగింది.

"అమృతాంజనం కోసం చూస్తున్నాను చారుకి రాయవచ్చని."

"అమృతాంజనం ఎప్పుడో అయిపోయిందమ్మా. మామ్మకి రాయడానికి కూడా లేదు. శంకరం చేత అదికూడా తెప్పించు." శాంతమ్మ మెల్లిగా చెప్పింది.

"శంకరం ఇంట్లో లేదు. బయటికి వెళ్ళాడు" అంది భానుమతి.

అన్ని మాటలూ వినిపిస్తున్నా, చారుమతి మాట్లాడకుండా పడుకుంది. ఆ మౌనం తుఫాను ముందు ప్రశాంతతలా ఉంది.

ప్రైవేట్ల కోసం వచ్చిన పిల్లల్ని ఇళ్ళకి పంపించేసింది భానుమతి.

చారుమతి విసుగ్గా తలనొప్పి అంటూ ఇంటికి రావడం, ఏ మాత్రం తేడా వచ్చినా, ఇంట్లో అందరి మీదా కసురుకోవడం ఇంట్లో వాళ్లకి అలవాటే. కాని ఈ రోజు మౌనంగా పడుకున్న చారుమతిని చూస్తే ఇంకా భయం వేసింది.

"అక్క అలా పడుకుందేం?" అంటూ వచ్చింది మాలతి. మాలతి పొద్దున్న ఎనిమిది గంటలకి టైపు నేర్చుకోవడానికి వెళుతుంది. సాయంత్రం అయిదు గంటలకి హిందీ నేర్చుకోవడానికి వెళ్లి ఏడు గంటలకి తిరిగి వస్తుంది.

మాలతి ప్రశ్నకు, 'నువ్వు ఊరుకో' అన్నట్లు సంజ్ఞ చేసింది భానుమతి. మాలతి స్వభావం విషయంలో భానుమతి పోలిక. చాలా నెమ్మది.

వంట కాగానే భోజనానికి రమ్మని ఎనిసార్లు పిలిచినా రాలేదు చారుమతి. అలాగే కదలకుండా పడుకుంది. ముసలమ్మకి అన్నం తినిపించి, శాంతమ్మ వంట ఇంటి గుమ్మంలో కూర్చుంది. చారుమతి కోపం అంతా శంకరం మీద అని గ్రహించింది భానుమతి. 'వాడు రాగానే ఇంట్లో ఏం అల్లరి జరుగుతుందో?' అనుకుంటూ ఆందోళనతో కూర్చుంది భానుమతి. మాలతి మాస్టారి దగ్గిరి నించి తెచ్చుకున్న పత్రికలు చదువుకుంటూంది.

తొమ్మిది గంటలకి శంకరం వచ్చాడు. బట్టలు మార్చుకుని, "అమ్మా! అన్నం పెడతావా?" అంటూ వంటింట్లోకి వెళ్ళాడు.

"మాలతీ! నువ్వూ, అక్కయ్యలూ కూడా భోజనానికి రండి. వడ్డించేస్తాను" అని కేకేసింది శాంతమ్మ.

"అక్కా! భోజనానికి రా" అంటూ చారుమతిని లేపింది మాలతి.

"నేను రాను, మీరు తినండి" అంది చారుమతి అటు తిరిగి పడుకునే.

"లే చారూ! పొద్దున్ననగా తిన్నావు. ఆకలేస్తూ ఉంటుంది. నువ్వు తినకపోతే మేమెవ్వరం తినం" అంటూ లాలింపుగా చెప్పింది భానుమతి. చారుమతి ఏమనుకుందో, లేచి వంటింట్లోకి వచ్చింది. అప్పటికే శంకరం భోజనానికి ఉపక్రమించాడు. చారుమతి కంచం ముందు కూర్చుంటూ శంకరాన్ని చూసి అడిగింది.

"మహారాజుగారు ఎక్కడ తిరుగుతున్నారేమిటి?"

శంకరం ఒకసారి తలెత్తి చూసి మళ్ళీ వంచేసుకున్నాడు.

"చేసే పని ఎలాగా లేదు. ఇంట్లో కావలిసిన వస్తువులేనా తేకూడదా? అవసరం వచ్చినప్పుడు ఎప్పుడూ కనిపించవు. సాయంత్రం గుక్కెడు కాఫీ నీళ్ళు లేక విలవిల లాడాను. పోనీ, కొంచెం హోటల్ కి వెళ్లి కాఫీ తెచ్చావా? అసలు ఇంట్లో ఉంది ఏడిస్తేగా? ఊరు మీద బలాదూరు తిరగడానికి వెళతారు అబ్బాయిగారు."

"ఎందుకే చారూ ఇప్పుడా మాటలన్నీ. భోజనాలయ్యాక మాట్లాడుకోవచ్చును." తల్లి కూతుర్ని శాంతపరచాలని అంది.

చారుమతి మరీ రెచ్చిపోయింది. "చూడు, ఇన్ని అన్నా ఒక్క మాట అంటాడేమో! తనకేం? పూలరంగడిలా భోజనం చేసి షికార్లు కొడతాడు. ఎంతమందికి ఉద్యోగాలు దొరకటం లేదు? తెలిసి వాళ్ళందరి దగ్గిరికి వెళితే ఎవరేనా సహాయం చెయ్యక పోరు. వీడు వెళతాడా? అబ్బాయిగారికి నామోషి. తనకంటె చిన్నది చెల్లెలు సంపాదిస్తూ ఉంటే, తినడానికి సిగ్గు లేదు. ఇంట్లో కష్ట సుఖాలు ఏమైనా తెలుస్తున్నాయా? ఉదయం లేచిన దగ్గిర నించి ఇంట్లో భానక్క, బయట నేనూ కష్టపడుతున్నామే, ఏమైనా జాలి ఉందా? సహాయం చెయ్యాలనే తలంపు ఉందా?"

చారుమతి వాగ్ధోరణి సాగుతూనే ఉంది.

"వాణ్ణి అన్నం తిననియ్యవేమిటి?"అని శాంతపరుస్తూ శాంతమ్మ , భానుమతీ ఎంత ఆపాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు.

శంకరం గబగబా అన్నం తిని, మౌనంగా వెళ్లి పోయాడు. చారుమతి కూడా సగం భోజనం చేసి కంచంలో చేతులు కడిగేసుకుని లేచి పోయింది.

"నీ కోపం భోజనం మీద చూపిస్తే ఎలాగే! అర్థాకలితో లేచిపోకు" అంటూ శాంతమ్మ వెనకనించి చెపుతున్నా, "నా మనస్సు బాగుండలేదు" అంటూ వంటింట్లోంచి బయటికి వెళ్లి పోయింది.

భానుమతి, మాలతి, శాంతమ్మ బొమ్మల్లా కూర్చుండి పోయారు. భానుమతే అంది చివరికి.

"చారుకి ఒంట్లో బలం లేదమ్మా. రోజూ సాయంత్రం రాగానే నీరసం అంటుంది. పనికి తగ్గ బలమైన ఆహారం లేదు. మనిషి చూశావా ఆర్చుకు పోతూంది. నీరసం మీద కోపం ఎక్కువయింది."

"రేపటినించి ప్రైవేట్లు నేను చెబుతానమ్మా. ఇన్నాళ్ళూ నాకు తోచలేదు. అక్కకి కాస్త విశ్రాంతిగా ఉంటుంది" అంది మాలతి.

శాంతమ్మ కొంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ కూర్చుంది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments